విద్యుత్ కోత..
ఉక్కపోత..!


పగలు.. రాత్రి తేడాల్లేని కోతలు.. అల్లాడిపోతున్న జిల్లావాసులు

అనంతపురం రూరల్, మార్చి 20: వేసవి ఎండల తీవ్రత రోజు రోజుకీ పెరుగుతోంది. మరోవైపు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిరంతరం విద్యుత్ సరఫరా చేసి, ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలి. కానీ విద్యుత్ శాఖ అధికారులకు ఇదేమీ పట్టడం లేదు. జిల్లాలో విద్యుత్ సరఫరా అధ్వానంగా తయారైంది. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఇష్టారాజ్యంగా కోతలు పెడుతున్నారు. జనానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయి. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ఉదయం 10 గంటలు దాటితే కాలు బయటికి పెట్టలేని పరిస్థితి. సాయంత్రం ఐదు గంటలు దాటినా సెగలు తగ్గడం లేదు. ఈ పరిస్థితులలో ఫ్యాన్, కూలర్, ఏసీ.. ఏదో ఒకటి వాడాల్సిందే. లేదంటే పొయ్యిమీద కూర్చున్నట్లుగా ఉంటుంది. కానీ ఆ అవకాశం జిల్లా ప్రజలకు లేకుండాపోతోంది. సేదదీరేందుకు కరెంటు సక్రమంగా ఉండటం లేదు. గంటల తరబడి కోతలు అమలవుతున్నాయి. నగరంలోని హైదర్‌వలి కాలనీ ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా కాలేదు. జేఎన్‌టీయూ పరిసర ప్రాంతాల్లో సాయంత్రం రెండు మూడు గంటలపాటు కరెంటు కోతపెడుతున్నారు. వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి ఫోన్ చేస్తే.. లో ఓల్టేజీ, హై ఓల్టేజీ అని ఏదో ఒకటి చెబుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అర్ధరాత్రి కరెంటు కట్ చేసేస్తున్నారు. దీంతో ఉక్కపోత భరించలేక జనం అల్లాడిపోతున్నారు. ఆరుబయటకు వద్దామంటే దోమల బెడద ఎక్కువగా ఉంది. చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులకు విద్యుత్ కోతలు నరకం చూపిస్తున్నాయి.

పల్లెలోనూ ఇదే పరిస్థితి..

పట్టణాలు, నగరాల కంటే పల్లెలో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. కరెంటు ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. పగటి వేళల్లో అర గంట కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని జనం వాపోతున్నారు. కరెంటు పోతే గంట, రెండు గంటలు ఎదురుచూడాల్సి వస్తోందని అంటున్నారు. రాత్రివేళల్లోనూ ఇదేలా కోతలు విధిస్తున్నారని అంటున్నారు. వేసవి కారణంగా విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. రోజువారీ వినియోగం 20 మిలియన్ యూనిట్లకు పైగా ఉంటోంది. ఈ క్రమంలో స్థానికంగా ఓల్టేజీ సమస్యలు వస్తున్నాయని విద్యుత్ శాఖ వర్గాలు అంటున్నాయి.

కోతలు లేవు..

జిల్లాలో అధికారికంగా విద్యుత్ కోతలు లేవు. ఏమైన సమస్యలుంటే స్థానికంగా ఉంటాయి. సంబంధిత ప్రాంతాల ఏఈలను సంప్రదిస్తే సమస్యను పరిష్కరిస్తారు.

- రాజశేఖర్, ఈఈటీ


గత ఏడాది జూన్‌లో జరిగిన స్పాట్ వాల్యూయేషన్(ఫైల్)

విద్యార్థి దశలో పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమైనవి. ఈ పరీక్షల నిర్వహణకు గతంలో ప్రభుత్వాలు వెంటనే నిధులు ఇచ్చేవి. బిల్లులు పెట్టిన వెంటనే మంజూరు చేసేవి. పెండింగ్ అనే మాటకు తావు ఉండేది కాదు. కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక పరీక్షలు నిర్వహించి, బిల్లుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. డబ్బుల కోసం అధికారులు, ఉపాధ్యాయులు తలలు పట్టుకునే పరిస్థితి. గడిచిన రెండు విద్యా సంవత్సరాలకు సంబంధించిన పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదు. దీంతో ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు జగన్ ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండేళ్లకు సంబంధించి జిల్లాలో రూ.19 లక్షల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

- అనంతపురం విద్య

2 ఏళ్లుగా పరీక్షల బిల్లులు పెండింగ్


- ఇంతలో మళ్లీ పదో తరగతి పరీక్షలు
- ఇప్పటికే రావాల్సినవి రూ.19 లక్షలు
- టీఏ, డీఏలు ఇవ్వని జగన్ ప్రభుత్వం
- మండిపడుతున్న ఉపాధ్యాయులు, సంఘాలు


స్పాట్ జరిగే కేఎస్ఆర్ హైస్కూల్

ఇంకెప్పుడు..!

ఏపీ ఇవ్వలేదు

గత ఏడాది 10వ తరగతి పరీక్షల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులకు పారితోషికం, టీఏ, డీఏలు ఇప్పటి వరకూ ఇవ్వలేదు. గత ఏడాది జూన్‌లో జరిగిన సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి టీఏ, డీఏ, పారితోషికం బిల్లులు ఏకంగా రూ.11,59,000 రావాల్సి ఉంది. రవాణా, తాగునీరు, ఇతర ఏర్పాట్ల ఖర్చుల బిల్లులు మరో రూ.4,11,000 పెండింగ్‌లో ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. 2022 ఏడాది పరీక్షలకు సంబంధించి మరో రూ.4.07 లక్షల వరకూ బిల్స్ పెండింగ్‌లో ఉంచారు. దీంతో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం బిల్స్ అప్‌లోడ్ చేశాం, అన్నీ గ్రీన్ చానల్‌లో ఉన్నాయని అంటున్నారు. ఈ బిల్స్ పెండింగ్‌లో ఉండగానే.. ఈ ఏడాది పరీక్షలు వచ్చాయి. వీటి బిల్లులు సంగతి ఏమౌతుందోనని ఉపాధ్యాయులు, అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అప్పు చేసి సర్దుబాటు

గతంలో నిర్వహించిన పరీక్షలు, స్పాట్ బిల్లులను జగన్ ప్రభుత్వం ఇవ్వలేదు. తాజాగా 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ అధికారుల చేతికి డబ్బులు రాలేదు. దీంతో ఉపాధ్యాయులు, ఇతర అధికారులతో పరీక్షల విభాగం అధికారులు మాట్లాడి, బయట అప్పులు చేయించి పరీక్షల పనులు చక్కబెడుతున్నారు. 'బిల్లుల సంగతి తరువాత చూసుకుందాం. ముందు పనులు కావాలి' అంటూ కొందరు చేబదుళ్లు తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తిరిగేందుకు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇతర రవాణా ఖర్చులు, స్టేషనరీ ఖర్చులు ఉండనే ఉన్నాయి. వీటన్నింటినీ అధికారులే సర్దుబాటు చేసుకుంటున్నారు.

బాకీ చెల్లిస్తేనే స్పాట్‌కు..

గత ఏడాది పదో తరగతి పరీక్షలు, స్పాట్‌కు సంబంధించి బిల్లులను ఇంత వరకూ చెల్లించలేదు. ఇది చాలా దారుణం. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న పారితోషికాన్ని ఉపాధ్యాయులకు చెల్లించాలి. వాటిని చెల్లిస్తేనే ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల స్పాట్‌కు ఉపాధ్యాయులు వెళ్లాలి. లేదంటే నిరసన తెలపాలి.



- కోటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

పూర్తి బడ్జెట్ ఇవ్వాలి..

రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి పరీక్షలు, స్పాట్ విషయంలో నిర్లక్ష్యం వీడాలి. గత ఏడాది రెమ్యునరేషన్, బిల్స్ పెండింగ్‌లో ఉంచారు. ఇది ఏమాత్రం సబబుకాదు. కొత్త జీవో ఆధారంగా పెంచిన ధరల మేరకు పరీక్షలు, స్పాట్‌కు పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయించాలి. ఈ ఏడాది పరీక్షల మూల్యాంకనం పూర్తయ్యేలోగా బకాయిలను చెల్లించాలి.



- సిరాజుద్దీన్, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి

నా కూతురు
ఎక్కడ..?

పోలీస్ స్టేషన్ వద్ద మహిళ ఆందోళన


సీఐ వాహనానికి అడ్డంగా కూర్చున్న బాలిక తల్లి


కళ్యాణదుర్గం, మార్చి 20: తన కూతురు ఆచూకీ తెలపాలని కోరుతూ ఓ మహిళ సీఐ వాహనానికి అడ్డంగా బైఠాయించి నిరసన తెలిపారు. కళ్యాణదుర్గం పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఆమె ఆందోళనకు దిగారు. పట్టణానికి చెందిన 17 ఏళ్ల బాలిక 15 రోజుల క్రితం నుంచి కనిపించడం లేదు. తమ పక్కింటి యువకుడు మాయమాటలు చెప్పి తన కూతురును తీసుకువెళ్లాడని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకూ చర్యలు తీసుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దిశ, డయల్ 100కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఈ నేపథ్యంలో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట సీఐ వాహనానికి అడ్డుగా బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తన కూతురు ఆచూకీ గుర్తించి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఐ హరినాథ్‌తో ఆమె వాదనకు దిగారు. పక్కింటి యువకుడు తన కూతురును తీసుకువెళ్లాడని ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. తన కూతురును చిత్రహింసలకు గురిచేసి, ఆ వీడియోలు తనకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కూతురు తన వద్దకు రాకపోతే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అప్పగిస్తామని సీఐ అన్నారు.

మాయదారి రోగాలు..!

ఎన్నికల విధులకు రాలేమని దరఖాస్తులు

విస్తుగొలిపేలా కొందరు గురువుల తీరు


విశ్రాంత ఉద్యోగిని వెరిఫికేషన్‌కు పిలిచిన అధికారులు



అనంతపురం విద్య, మార్చి 20: ఎన్నికల విధుల నుంచి తప్పించుకునేందుకు కొందరు టీచర్లు దొంగదారి పట్టారు. ఉన్నఫలంగా.. లేని రోగాలు సృష్టించుకుని మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. వీరి సంగతి ఇలా ఉంటే, కలెక్టరేట్‌లో వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు ఇంకో అడుగు ముందుకు వేశారు. ఓ రిటైర్డ్ టీచర్‌ను వెరిఫికేషన్‌కు ఆహ్వానించారు. గార్లదిన్నె మండలం పెనకచెర్ల ఎస్సీ కాలనీ ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని కిట్టూబాయి ఇటీవల స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. జనవరి 31న ఆమె వీఆర్ఎస్ తీసుకున్నారు. ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరినవారిలో 50 మంది ఉపాధ్యాయులను గురువారం వెరిఫికేషన్‌కు రావాలని పిలిచారు. ఆ జాబితాలో విశ్రాంత హెచ్ఎం కిట్టూబాయి కూడా ఉండటం చూసి పలువురు నివ్వెరపోయారు.

దొంగదారి

ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు పలువురు ఉపాధ్యాయులు అయిష్టత చూపుతున్నారు. మనకెందుకులే ఎన్నికల గొడవ.. ఏదో ఒక జబ్బు ఉన్నట్లు చెబితే పోలా అని తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బుక్కరాయసముద్రం మండలంలోని ఓ పాఠశాల హెచ్ఎం.. గుండె సమస్య పేరిట, అదే మండలంలోని ఓ ఎంపీయూపీ స్కూల్‌లో పని చేసే స్కూల్ అసిస్టెంట్ ఓహెచ్ జబ్బు పేరిట, గార్లదిన్నె మండలంలోని ఓ స్కూల్‌లో పనిచేసే టీచర్, ఓ యూనియన్ రాష్ట్ర నాయకుడు వైకల్యం ఉందని మినహాయింపు కోరారు. ఇవన్నీ ఉత్తుత్తివే అని సమాచారం. మరికొందరు టీచర్లు సైతం వైకల్యం, ఓహెచ్, వీహెచ్, హార్ట్ సమస్యల పేరిట తప్పించుకోవాలని చూస్తున్నారు. వెరిఫికేషన్ కమిటీ ఇలాంటి వారిని మినహాయిస్తుందా, విధులకు రావాల్సిందే అని ఆదేశిస్తుందా- తేలాల్సి ఉంది.


రంజాన్ వేళలు

ఇఫ్తార్	గురువారం సాయంత్రం	06:32
సెహరీ	శుక్రవారం ఉదయం	05:06

19,98,841 మంది ఓటర్లు

కలెక్టర్ గౌతమి

అనంతపురం టౌన్, మార్చి 20: జిల్లాలో 19,98,841 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ గౌతమి వెల్లడించారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఓటర్ల గణాంకాలను కలెక్టర్ వారికి వివరించారు. ఈ నెల 19వ తేదీ నాటికి 19,98,841 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుకు ఏప్రిల్ 15 వరకు అవకాశం ఉందని తెలిపారు. ఫారం-6 దరఖాస్తుల పరిశీలన అనంతరం ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకావం ఉందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 16న సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 26న పరిశీలిస్తామని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29 వరకు గడువు ఉంటుందని అన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటరు జాబితాలో ఎక్కడా పేరు నమోదు చేసుకోని వారి నుంచి ఫారం-6 దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగించాలని కోరుతూ వచ్చిన ఫారం-7 దరఖాస్తులను ఎన్నికల కమిషన్‌కు పంపుతామని, అక్కడి నుంచి అనుమతి తీసుకున్న తర్వాతనే తొలగిస్తామని స్పష్టం చేశారు. ఓటింగ్ శాతం పెంచడానికి కార్యాచరణ ప్రణాళిక ఇచ్చామని, నియోజకవర్గాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లాలో ఈ సారి పోలింగ్ కేంద్రాల సంఖ్య 2,236కు చేరిందని, ఇందులో 2,213 పోలింగ్ కేంద్రాలు, 23 సహాయక పోలింగ్ కేంద్రాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో 1,032 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించామని తెలిపారు.

దుర్గంలో టీడీపీదే గెలుపు

పాస్టర్ల సమావేశంలో అమిలినేని


కళ్యాణదుర్గం, మార్చి 20: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గెలిచేది టీడీపీనేనని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద బుధవారంపాస్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు అమిలినేని సురేంద్రబాబును ఘనంగా సన్మానించారు. అనంతరం సురేంద్రబాబు గెలుపునకు పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే పాస్టర్ల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. క్రైస్తవుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు అభ్యున్నతి ఒక్క టీడీపీతోనే సాధ్యమవుతుందని అన్నారు. టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని, కళ్యాణదుర్గం కంచుకోటలో టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరు శాయశక్తులా కృషి చేయాలని కోరారు. అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి, చెల్లెలు రాధ పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి టీడీపీకి మద్దతివ్వాలని ఓటర్లను కోరారు.


అమిలినేనిని సన్మానిస్తున్న పాస్టర్లు

లలలాం.. లలలాం..

అసమ్మతి నాయకులకు ఖరీదైన వాహనాలు

లక్కీఛాన్సులే..!



తాడిపత్రి టౌన్, మార్చి 20: ఓటర్లను ప్రలోభ పెట్టడం ఇప్పటివరకూ చూశాం.! కానీ అధికార పార్టీవారు ఇప్పుడు సొంత పార్టీవారినీ ప్రలోభ పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. అసమ్మతి నాయకులను బుజ్జగించేందుకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ఓటరుకు అయితే.. ఐదొందలు.. వెయ్యి.. పోటీ తీవ్రతను బట్టి రూ.5 వేల దాకా ఇచ్చిన సంఘటనలు ఉన్నాయి. ఇవి కాకుండా మహిళలకు చీరలు, ముక్కు పుడకలు, వెండి కుంకుమ భరిణెలు.. ఇలా రకరకాల కానుకలూ ఇస్తుంటారు. కానీ నాయకులు ఓటర్లు కాదు కదా..! అందుకే ఖరీదైన కార్లను కానుకగా ఇస్తున్నారు. లేకుంటే ఎదుటిపార్టీలోకైనా చేరుతారు.. అదీ కాదంటే వెంటే ఉండి ఓడిస్తారు..! ఇదీ.. ఇప్పుడు అధికార పార్టీలోని కొందరు అభ్యర్థులను కలవరపెడుతున్న సమస్య.

తాడిపత్రిలో జోరుగా బుజ్జగింపు రాజకీయాలు

శింగనమలలో కార్లతో పాటు విందులు కూడా..


లక్షలు ఖర్చు చేస్తున్న అధికారపార్టీ నాయకులు

తాడిపత్రి కథే వేరు..



రాష్ట్ర రాజకీయాలు వేరు... తాడిపత్రిలో రాజకీయాలు వేరు..! ఇక్కడ గెలుపోటములు ఎప్పుడూ చర్చనీయాంశాలే..! ఒకప్పుడు ఫ్యాక్షన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో.. ఎన్నికలు ఇప్పటికీ హాట్ హాట్‌గానే జరుగుతుంటాయి. ఇక్కడ గెలుపు అంత సునాయసంగా దక్కదు. అందుకే అధికార పార్టీకి చెందిన ఓ కీలక నాయకుడు పార్టీలోని అసంతుష్టులను బుజ్జగించేందుకు భారీగా ఖర్చు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అసమ్మతితో రగిలిపోతున్న కొందరు ద్వితీయశ్రేణి నాయకులు పార్టీ మారుతున్నారు. దీంతో మిగిలిన వారిని కాపాడుకునేందుకు వారికి ఖరీదైన వాహనాలను కొనిస్తున్నారని సమాచారం. నాయకుల స్థాయిని బట్టి ఇన్నోవా, స్కార్పియో.. తదితర వాహనాలను కొనిస్తున్నారట. ఇంతేకాదు.. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అడిగిన అన్ని పనులు చేస్తామని హామీలు గుప్పిస్తున్నారట.

అక్కడా కొనిస్తున్నారు..




తాడిపత్రితోపాటు అధికార పార్టీ శింగనమల నియోజకవర్గ నాయకులు కూడా కార్లను ఎరవేస్తున్నారని తెలిసింది. వైరి వర్గంగా వ్యవహరిస్తున్న ద్వితీయశ్రేణి నాయకుల కోసం లక్షలు ఖర్చుచేసి కొత్త వాహనాలను కొనుగోలు చేస్తున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఒక్కో వాహనం ఖరీదు రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉంటుందని సమాచారం. అధికార పార్టీ కీలక నాయకులు డౌన్ పేమెంట్ చెల్లించి.. వాహనాలను అసమ్మతి నాయకులకు కానుకగా ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఓ నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి 10 నుంచి 15 వాహనాలను కొనుగోలు చేశారన్న ప్రచారం సాగుతోంది. అధికార పార్టీలోని అసమ్మతి నాయకులు ఇతర పార్టీల్లోకి వెళుతుండడంతో.. అడ్డుకట్ట వేసేందుకు అధికారపార్టీవారు జాగ్రత్తపడుతున్నారు. అందులో భాగంగానే వాహన రాజకీయాలకు తెరలేపారని సమాచారం.

ఈనాటిది కాదట..

ఖరీదైన వాహనాలతో అసంతుష్టులను 'కొనుగోలు' చేయడం ఈనాటిది కాదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గ నాయకులతోపాటు శింగనమల నియోజకవర్గంలోని పుట్లూరు, యల్లనూరు మండలాల నాయకులకు గత ఎన్నికల సమయంలోనూ ఇలాంటి కానుకలే అందాయని అంటున్నారు. అప్పట్లో సుమారు 20 నుంచి 30 వాహనాలను ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి పంచిపెట్టారని అంటున్నారు.

డీజిల్ ఎవరు పోయిస్తారు..?



గుర్రం కొనిస్తేమాత్రం.. దానికి గడ్డి ఎవరు పెడతారు..? దాని కాళ్లకు లాలం ఖర్చు ఎవరు భరిస్తారు..? అన్నట్లుగా వ్యవహరిస్తున్నారట అసంతుష్టులు..! టైం.. బాబూ టైం..! ఏం చేస్తారు..! ఇంతకూ ఈ సమస్య ఎందుకొచ్చిందంటే.. పార్టీ అధికారంలోకి రాగానే చాలామంది ద్వితీయ శ్రేణి నాయకులు అభివృద్ధి పనులను ఎగబడి చేశారు. కానీ వాటికి బిల్లులు రాలేదు. అప్పులపాలయ్యారు. ఏళ్ల తరబడి బిల్లుల కోసం ఎదురుచూస్తుంటే.. ఇప్పుడు ప్రచారానికి వెళ్లమని వాహనాలు ఇస్తారా..? వాటికి డీజిల్ ఖర్చులు ఎవరిస్తారు అని ప్రశ్నిస్తున్నారట. తాము దారుణంగా దెబ్బతిన్నామని, ఆ మాత్రం ఖర్చులకూ తమ వద్ద డబ్బులు లేవని పలువురు వాపోతున్నారని సమాచారం. సాధారణంగా ఎన్నికలకు నెలరోజుల సమయం ఉన్నప్పుడే ఖర్చులను భరించడానికి నాయకులు భయపడేవారు. ఈసారి సుమారు రెండు నెలల సమయం పడుతోంది. ఇన్ని రోజులు ఖర్చులు భరించడమంటే మాటలా..? అని చాలామంది నాయకులు ప్రచారానికి వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే అభ్యర్థులు దగ్గరుండి ఖర్చు పెడుతున్నారు. ప్రచారానికి వచ్చే వాహనాలకు డీజిల్, ఖర్చులను తామే భరిస్తామని చెప్పి పంపుతున్నారు.

ఏం కావాలంటే అవి..

శింగనమల నియోజకవర్గంలోని పుట్లూరు, యల్లనూరు మండలాల్లో అధికారపార్టీ అసమ్మతి నాయకులకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నారు. మరొకసారి పార్టీ అధికారంలోకి వస్తే సర్పంచులు, ఎంపీటీసీ పదవులతోపాటు పంచాయతీల నిర్వహణ అప్పగిస్తామని హామీలు ఇస్తున్నారు. చాలా గ్రామాల్లో ఒక వైసీపీ నేత వర్గాన్ని పక్కన పెట్టడంతో.. ఆయనకు భారీగా వ్యతిరేకత వస్తోంది. దీంతో ఆ వర్గాన్ని బుజ్జగించడానికి నాయకులు తంటాలు పడుతున్నారు. 'ఐదేళ్ల నుంచి పక్కనపెట్టి.. ఓట్ల కోసం ఇప్పుడు వచ్చావా?' అని సదరు నాయకులు నిలదీస్తుండటంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సర్వేల ఆధారంగా.. గెలుపు ప్రతిపక్ష అభ్యర్థిదే అని తెలుసుకుని.. పలువురు పార్టీ మారుతుండటంతో అధికారపార్టీ నాయకుల్లో అలజడి మొదలైంది. కొన్ని గ్రామాల్లో గ్రామస్థాయి నాయకులకు డబ్బులను ఎరవేస్తున్నారు. పార్టీలోనే ఉండాలని బుజ్జగిస్తున్నారు.



జోరుగా విందు రాజకీయాలు

బుజ్జగింపు రాజకీయాలలో విందులు కీలకం. అందుకే.. వాహనాలతో సరిపెట్టకుండా.. విందులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. మాఘమాసం అయిపోవడంతో జంపింగ్ నాయకులను అడ్డుకునేందుకు భారీస్థాయిలో విందులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రచారానికి వెళ్లే గ్రామాల్లో విందు ఏర్పాటు చేయడానికి ద్వితీయశ్రేణి నాయకులకు ఖర్చులకు ముందుగానే ముట్టజెప్పుతున్నారని సమాచారం. అధికారపార్టీ నాయకులు గ్రామాల్లో విందులు పోటాపోటీగా ఏర్పాటుచేసుకుంటున్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 95 శాతం హాజరు

అనంతపురం విద్య, మార్చి 20: జిల్లాలో పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 95 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 32,209 మంది విద్యార్థులకు గాను 30,466 మంది హాజరు కాగా, 1743 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షల షెడ్యూల్ మేరకు గురువారం ఎలాంటి పరీక్షలూ లేవని, శుక్రవారం గణితం పరీక్ష ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల





కళాశాలలో తాగునీటి కొళాయిలను ఎత్తుకెళ్లిన దృశ్యం



కళాశాలలో వాష్ రూముల తలుపులను తొలగించిన దుండగులు



బాత్‌రూముల్లో బేసిన్లు, నీటి కొళాయిలను ఎత్తుకెళ్లిన దుండగులు

టీడీపీ వాళ్లు కట్టారని..!

ఐదేళ్లుగా ప్రారంభానికి నోచుకోని భవనాలు



- నూతన భవనాలలో వస్తువుల చోరీ
- విలువైన పరికరాలు చోరీ, ధ్వంసం
- మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం అన్యాయం

రూ. 10 కోట్ల ప్రజా ధనం వృథా

ముస్లిం మైనార్టీ విద్యార్థుల కోసం కోట్ల రూపాయలతో నిర్మించిన భవనాలు ప్రారంభించక మునుపే పాడై పోతున్నాయి. జిల్లాలో అత్యధికంగా ముస్లింలు ఉండే గుంతకల్లులో ఆయా వర్గాల విద్యార్థుల కోసం గత టీడీపీ ప్రభుత్వం రూ. 10 కోట్లతో విద్యా భవనాలను నిర్మించింది. ప్రారంభించేలోపే ఎన్నికలు రావడం ముస్లిం విద్యార్థులకు శాపంగా మారింది. అధికార మార్పిడి జరగడంతో గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఈ భవనాలను ప్రారంభించకుండా తాత్సారం చేసింది. ఈ భవనాలను ఇతర అవసరాలకు మళ్లించి మైనార్టీ విద్యార్థులకు అన్యాయం చేసింది. - గుంతకల్లు

రూ. పది కోట్లతో నిర్మాణం

మల్టీ సెక్టోరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్‌డీపీ) కింద కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంలో రూ.10 కోట్లు ఖర్చుచేసి పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఉర్దూ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఉర్దూ బాలికల వసతి గృహం, ఉర్దూ బాలుర వసతి గృహ నిర్మాణాలను చేపట్టింది. వాటిలో జూనియర్ కళాశాల, బాలబాలిక వసతి గృహాల నిర్మాణాలను పూర్తి చేసింది. కళాశాల, హాస్టళ్లకు సిబ్బందిని నియమించక మునుపే 2019లో ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ భవనాలను ప్రారంభించడానికి ఎటువంటి చర్యలూ తీసుకోకపోగా, వాటిని ఇతర అవసరాలకు వినియోగించింది. దీంతో మైనార్టీ ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉన్నత విద్య దూరమైంది. ఖాళీగా ఉన్న భవనాలను కనీసం పరిరక్షించకపోవడంతో లక్షల విలువైన విద్యుత్, ప్లంబర్ పరికరాలు, తలుపులను దొంగలు ఎత్తుకెళ్లారు.



రూముల్లో సీలింగ్ ఫ్యాన్లను దొంగలు ఎత్తుకెళ్లిన దృశ్యం



ప్రభుత్వ ఉర్దూ బాలికల వసతి గృహ భవనం

మైనార్టీ భవనాలు ఇతరాలకు..

తమది ముస్లిం పక్షపాత ప్రభుత్వమని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన వైసీపీ ప్రభుత్వం వారిలో విద్యా వికాసం కోసం నిర్మించిన కళాశాల, హాస్టలు భవనాలను ఇతర అవసరాలకు వినియోగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కసాపురం రహదారికి ఆనుకుని పాత తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్మించిన ఉర్దూ బాలుర వసతి గృహాన్ని ఆర్డీవో కార్యాలయానికి వినియోగిస్తున్నారు. గుంతకల్లుకు ఆర్డీవో కార్యాలయాన్ని మంజూరు చేయగా, అందుకోసం కొత్త భవనాన్ని నిర్మించడమో, అద్దె భవనాన్ని లీజుకు తీసుకుని ఏర్పాటు చేయడమో చేయాలి. కానీ అలా చేయకుండా మైనార్టీ ఉర్దూ బాలుర హాస్టలు వృథాగా ఉంది కదా అని రెండేళ్ల కిందట అందులో ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మైనార్టీలు ఆందోళన చేయగా అతి త్వరలో ఆర్డీవో కార్యాలయాన్ని నిర్మించి ఉర్దూ హాస్టలు భవనాన్ని ఖాళీ చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కానీ అది జరగలేదు. అంతటితో ఆగకుండా అద్దె భవనంలో ఉన్న బీసీ హాస్టలును ఎస్కేపీ జూనియర్ కళాశాల వద్ద నిర్మించిన ఉర్దూ బాలికల వసతి గృహంలోకి మార్పు చేయాలని ప్రతిపాదించారు. దీన్ని టీడీపీ, మైనార్టీలు తీవ్రంగా అభ్యంతరం చెప్పి, అడ్డుకోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించారు.



విద్యుత్ స్విచ్, మెయిన్ బోర్డులను తస్కరించిన దృశ్యం

దొంగల స్వైరవిహారం

మైనార్టీ ఉర్దూ కళాశాల, ఉర్దూ బాలికల వసతి గృహ భవనాలు ఖాళీగా ఉండటంతో వాటిపై దొంగల కన్నుపడింది. లక్షల విలువైన విద్యుత్, ప్లంబరు పరికరాలు, తలుపులను దుండగులు పీకేశారు. తరగతి గదులు, వసతి గదుల్లో పైకప్పునకు బిగించిన సీలింగ్ ఫ్యాన్లన్నింటికీ ఎత్తుకెళ్లారు. భవనాలలో విద్యుత్ సరఫరాకు ఏర్పాటుచేసిన స్విచ్ బోర్డులు, కంట్రోల్ బోర్డు ప్యానళ్లను లాక్కెళ్లారు. గోడల్లోంచి ఏర్పాటు చేసిన వైరింగ్‌ను పూర్తిగా లాగేసి వైర్‌ను తస్కరించారు. ఈ భవనాల్లో విద్యార్థులు, అధ్యాపకుల కోసం నిర్మించిన టాయిలెట్లు, బాత్ రూములలోని బేసిన్లు, కొళాయిలు, పైపులను దొంగిలించారు. అలాగే వాష్ రూములకు ఏర్పాటుచేసిన తలుపులను పీక్కెళ్లారు. తీసుకెళ్లడానికి సాధ్యంకాని విద్యుత్, తాగునీటి పరికరాలను, పైపులను ధ్వంసంచేశారు. గడచిన ఐదేళ్ల నుంచి ఈ భవనాలు నిర్వహణ లేని కారణంగా గోడలు నెర్రలిచ్చాయి. ఇలా కోట్లతో నిర్మించిన ఈ భవనాలు ప్రారంభానికి నోచుకోకమునుపే శిథిలావస్థకు చేరుకున్నాయి. వినియోగంలోకి తేవాలంటే మరలా లక్షలు వెచ్చించాల్సిన దుస్థితిలో ఈ భవనాలుండటంపై ముస్లిం వర్గాలతో పాటు ఇతరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





నిర్వహణ లేక నెర్రెలు చీలిన గోడలు



స్విచ్‌లు, కేబుల్, పైప్‌లను ధ్వంసం చేసిన దుండగులు

కన్నుల పండువగా ఖాద్రీశుడి కల్యాణం

కదిరి, మార్చి 20: బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవీ, భూదేవీ సమేత ఖాద్రీశుడి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. తొలుత యాగశాలలో కొలువుదీరిన వధువులు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, వరుడు శ్రీవారిని వేర్వేరుగా పల్లకిలో కల్యాణమండపానికి చేర్చారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీవారి ప్రతిరూపంగా విచ్చేసిన కంకణ భట్టాచార్యుల వారు అమ్మవార్లకు మాంగళ్యధారణ గావించారు. కల్యాణోత్సవం ముగిసిన తరువాత శ్రీవారు, అమ్మవార్లపై నుంచి జాలువారిన ముత్యాల తలంబ్రాల ను దక్కించుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు. సాధారణ వివాహాల్లో మాదిరిగానే ఇక్కడ కూడా కల్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులు శ్రీదేవి, భూదేవిల సమేత శ్రీవారికి చదివింపులు చదివించుకున్నారు.



దేవేరులతో శ్రీవారు

ప్రభుత్వం నుంచి స్వామి వారికి పట్టు వస్త్రాలు

ప్రభుత్వం, టీటీడీ నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈసంప్రదాయాన్ని తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రారంభించింది. శ్రీవారి కల్యాణోత్సవంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

పక్షం రోజుల పాటు కొనసాగుతున్న నారసింహుడి బ్రహ్మోత్సవాల ప్రారంభానికి సూచికగా బుధవారం ఉదయం ధ్వజారోహణాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను వీక్షించడానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించడం కూడా ఈధ్వజారోహణంలో భాగమే. ఇందులో భాగంగా గరుడుడి చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై ఆవిష్కరిస్తారు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన తరువాత అవరోహణం గావిస్తారు.



మాంగల్యం

నేడు హంసవాహనంపై శ్రీవారి దర్శనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఖాద్రీశుడు గురువారం హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. తిరువీధుల్లో స్వామి వారు ఊరేగనున్నారు.

మారని రంగు

ఆర్‌బీకేకి తొలగని వైసీపీ రంగులు

గుంతకల్లు, మార్చి 20: ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులు ఉండరాదంటూ కోర్టు ఆదేశాలున్నా గుంతకల్లు వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2020 ఫిబ్రవరి నెలలో ఆర్బీకేల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణంలోని మార్కెట్ యార్డులోని రైతు విశ్రాంతి భవనాన్ని రైతు భరోసా కేంద్రంగా మార్చారు. దానికి వైసీపీ జెండా రంగులు వేశారు. మే నెలలో ఆర్బీకేలకు వైసీపీ జెండా రంగులు వేస్తున్నారంటూ హైకోర్టులో ప్రభుత్వ వ్యతిరేక వ్యాజ్యాలు దాఖలయ్యాయి. దీనిపై హైకోర్టు స్పందించి వైసీపీ జెండా రంగులను తొలగించి తెలుపు రంగును వేయాలంటూ ఆదేశాలను జారీచేసింది. అన్ని చోట్లా ఆర్బీకేలకు వైసీపీ రంగులను తీసేసి తెలుపు రంగులను వేసినా, గుంతకల్లు ఆర్బీకే భవనానికి మాత్రం వైసీపీ రంగులను తొలగించలేదు. హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి నిర్లక్ష్యం చేశారు. పత్రికల్లో ఫొటోలు వచ్చినా ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. కాగా ప్రస్తుతం ఎన్నికల కోడ్ వచ్చాక కూడా వ్యవసాయ అధికారులలో ఏమాత్రం చలనం లేకుండాపోయింది. భవనంపై ఉన్న నేం బోర్డులో ఉన్న వైఎస్ఆర్, జగన్ చిత్రాలను మాత్రం తొలగించి, పార్టీ రంగులను అలాగే ఉంచేశారు.



వైసీపీ రంగుల్లో గుంతకల్లు రైతు భరోసా కేంద్రం

నిబంధనలా.. మాకా..?

- ఎన్నికల ప్రచారంలో విచ్చలవిడిగా వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు
- పలు చోట్ల తొలగింపు



వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్న రాళ్లపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్ (ఫైల్)



కొత్తచెరువులోని బీసీకాలనీలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్



కొత్తచెరువులో ఎమ్మెల్యే ప్రచారంలో పాల్గొన్న స్టోర్ డీలర్

ఎన్నికల సంఘం నిబంధనలను కొందరు గ్రామ వలంటీర్లు, ఉపాధి హామీ సిబ్బంది, స్టోర్ డీలర్లు బేఖాతరు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ అధికారులు వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురిపై చర్యలు తీసుకున్నారు. అలాగే అక్రమ వ్యవహారాలకు పాల్పడి పోలీసులకు పట్టుబడిన వలంటీర్లను తొలగిస్తున్నారు. అయినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యే అభ్యర్థుల వెంట తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తుండటం గమనార్హం.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

గుమ్మఘట్ట, మార్చి 20: మండలంలోని పూలకుంట, జే వెంకటంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు గ్రామ వలంటీర్లను విధుల నుండి తొలగించినట్లు ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ బాబు తెలిపారు. జే వెంకటంపల్లి వలంటీర్ శ్రీనివాసులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులందగా పూలకుంట వలంటీర్ హనుమంతు రెండు రోజుల కిందట కర్ణాటక నుండి అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడి రిమాండ్‌లో ఉన్నారు. దీంతో ఇద్దరు వలంటీర్లను విధుల నుండి తొలగించినట్లు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

గుడిబండ : మండలంలోని రాళ్లపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ నిబంధనలు అతిక్రమించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మండలంలోని కల్లురొప్పం గ్రామంలో రెండు రోజుల కిందట ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ గ్రామంలోని వైసీపీ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్ హాజరయ్యాడు. ఈ విషయంపై ఎంపీడీఓ బంగారమ్మను వివరణ కోరగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తమ దృష్టికి వస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధ్యాయుడు, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కొత్తచెరువు: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్న ఒక ఉపాధ్యాయుడిని, సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. పుట్టపర్తి మండలం తంబాలపర్తి పాఠశాలలో ఎస్జీ టీచర్‌గా పనిచేస్తున్న ఎస్.రామాంజనేయులు, కదిరి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శివప్రసాద్‌ను ఎన్నికల కార్యకలాపాల్లో పాల్గొని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్, స్టోర్ డీలర్లు

కొత్తచెరువు: మండల కేంద్రంలోని బీసీకాలనీలో బుధవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నిర్వహించిన ప్రచారంలో ఓ వలంటీర్ పాల్గొనడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ప్రచారంలో 1వ సచివాలయానికి సంబంధించిన గోరంట్లపల్లి గ్రామ వలంటీర్ హర్షద్ చిందులు వేస్తూ ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. అదేవిధంగా 2వ షాపు చౌక ధరల ధాన్యపు డీలర్ మండ్లి ప్రభావతమ్మ ఎమ్మెల్యే వెంట ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. బీసీకాలనీలో 4వ సచివాలయంలో పని చేస్తున్న వలంటీర్ సాయి ప్రకాశ్, ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్ మెన్‌గా పనిచేస్తున్న సుదర్శన్‌బాబు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వెంట చురుకుగా పాల్గొని ప్రచారం చేశారు.

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని గరీబ్‌నగర్‌లో ఎంపీ తలారి రంగయ్య మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం వలంటీర్ పాల్గొన్న అంశం బుధవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నిబంధనలు బేఖాతరు చేస్తూ వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది.

పుట్టపర్తి రూరల్: ఓడీచెరువు మండలం తుమ్మల కుంటపల్లిలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించిన వలంటీర్లు, ఫీల్డ్‌అసిస్టెంటుకు ఎంపీడీఓ షోకాజ్ నోటీసులు జారీచేశారు. మంగళవారం ఎమ్మెల్యే ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు కొమ్ము ఆదినారాయణ, నరసింహులు, ఫీల్డ్ అసిస్టెంటు రామకృష్ణలకు బుధవారం రాత్రి ఎంపీడీఓ వరలక్ష్మి షోకాజ్ నోటీసులు జారీచేశారు.



కొత్తచెరువులో బీసీ కాలనీలో ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ సాయిప్రకాశ్ (వృత్తంలోని వ్యక్తి)



ప్రచారంలో పాల్గొన్న మద్యం దుకాణంలో పని చేసే సేల్స్‌మన్ సుదర్శన్‌బాబు (బ్లాక్ షర్టు వేసుకున్న వ్యక్తి)



కళ్యాణదుర్గంలో ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ రిజ్వానా (వృత్తంలోని వ్యక్తి)

గడువు పొడిగింపు

అనంతపురం సెంట్రల్, మార్చి 20: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల ఫీజు గడువును పొడిగించినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ బుధవారం ప్రకటనలో తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి: డీఆర్‌ఎం

గుంతకల్లు, మార్చి20: మహిళలు విద్య, ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌ఎం వినీత్ సింగ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూడబ్ల్యూఓ) ఆధ్వర్యంలో స్థానిక రైల్ క్లబ్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌ఎం మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించగల శక్తి, సామర్థ్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో మహిళలు ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తారని కితాబిచ్చారు. అనంతరం డబ్ల్యూడబ్ల్యూఓ అధ్యక్షురాలు అంజనీసింగ్ ఆధ్వర్యంలో విధినిర్వహణలో ప్రతిభ చాటిన ఉద్యోగినులకు, కళాకారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సబార్డినేట్ అధికారులు, ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీకి చర్యలు చేపట్టండి: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 20: ఎన్నికల సామగ్రి పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను త్వరగా చేపట్టాలని కలెక్టరు గౌతమి అధికారులను ఆదేశించారు. అనంతపురం అర్బన్, శింగనమల నియోజకవర్గాలకు ఎన్నికల సామగ్రిని అందించేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఏర్పాట్లను కలెక్టరు గౌతమి బుధవారం కళాశాలకు వెళ్లి పరిశీలించారు. పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూంలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి పని ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఉండాలని ఆర్‌ఓలకు సూచించారు. భద్రతా పరంగా ఎలాంటి సమస్య లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురంఅర్బన్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గ్రంధి వెంకటేష్, శిగనమల నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ వెన్నెలశ్రీను, తహసీల్దార్ శివరామిరెడ్డి, డీపీఈఓ వెంకటరమణనాయక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టరు గౌతమి

ఇక ఆన్‌లైన్‌లోనే ఏపీ జీఎల్‌ఐ కార్యకలాపాలు

అనంతపురం టౌన్, మార్చి 20: ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఏపీ జీఎల్‌ఐ సేవలు నిధి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు కొనసాగుతాయని జిల్లా ఉపసంచాలకులు భాస్కర్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు పాలసీదారుల పాలసీలు, స్వీకరించిన ప్రీమియం వివరాలు నిధి పోర్టల్‌కు బదిలీ చేశామన్నారు. ఈనేపథ్యంలో ఏపీజీఎల్‌ఐ పాలసీ తీసుకున్న వారు, ఇప్పటికే అందులో లోన్ తీసుకున్న వారు, ఆ పోర్టల్‌లో పొందుపరిచిన డేటా సక్రమంగా ఉందో లేదో పరిశీలించుకొని ధ్రువీకరించుకోవాలన్నారు. ఇందుకు ఏప్రిల్ 30వతేదీ వరకు గడువు ఇచ్చినట్లు వెల్లడించారు. ఆతర్వాత పాలసీ వారీగా డేటా ముద్రించిన కాపీలు ఆయా శాఖల డీడీఓలకు పంపుతామన్నారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే ఏప్రిల్ 30లోగా మెయిల్ ద్వారా ఏపీజీఎల్‌ఐ కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'స్వామి భక్తి'పై కలెక్టర్ ఆగ్రహం

అనంతపురం విద్య, మార్చి 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అధికారులు సీఎం జగన్, విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ ఫొటోలున్న పోస్టర్లు అలాగే ఉంచారు. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'విద్యాశాఖ స్వామి భక్తి' శీర్షికన కథనం ప్రచురి తమైంది. జిల్లావిద్యాశాఖ కార్యాలయంలో సీఎం జగన్, విద్యాశాఖ మంత్రి ఫొటోలున్న పోస్టర్లను అలాగే ఉంచడంపై కలెక్టర్ జిల్లా విద్యాశా ఖాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనికితోడు కలెక్టరేట్ నుంచి రిజాయిండ్ కూడా కోరినట్లు తెలుస్తోంది. దీంతో డీఈఓ వెంటనే పోస్టర్లు తొలగించారు. అంతేకాకుండా వెంటనే డీఈఓ ఆఫీస్‌లో ఉన్న సూపరిం టెండెంట్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో ఎక్కడా ఫొటోలు, పోస్టర్లు లేకుండా చూడాలని ఆదేశిం చారు. అంతేకాకుండా స్కూల్ వేళల్లో కొందరు టీచర్లు డీఈఓ ఆఫీస్ వద్ద కనిపిస్తున్నారని, అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఆత్మహత్య కేసులో నలుగురికి రిమాండ్

గార్లదిన్నె, మార్చి 20: మండలంలోని పాతకల్లూరుకు చెందిన పూజిత అత్తరింటి వేధింపులు తాళలేక గత నెల 26న ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో భర్త లోకేష్, అత్త ఈశ్వరమ్మ, మామ మల్లికార్జున, మరిది మహేంద్రపై మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఆ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె, మార్చి 20 : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన సాంబశివ, అతని తల్లి ఈశ్వరమ్మ గాయపడ్డారు. వీరు బైక్‌లో అనంతపురం నుంచి పామిడికి వెళ్తూ గార్లదిన్నె సబ్‌స్టేషన్ సమీపంలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద స్లో అయ్యారు. వేగంగా వెనుకవైపు నుంచి లారీ వీరి బైక్‌ను ఢీకొనడంతో వారిద్దరూ గాయపడ్డారు. వారిని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె, మార్చి 20: మండలంలోని పెనకచెర్ల గ్రామంలో ఈశ్వరమ్మ బుధవారం ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి సంబంధించి కారణాలు తెలియాల్సి ఉంది.

జూదరుల అరెస్టు

ధర్మవరంరూరల్, మార్చి 20: కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలోని వ్యవసాయ పొలాల దగ్గర పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.17,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గార్లదిన్నె, మార్చి 20: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 24 మంది రౌడీషీటర్లకు ఎస్ఐ గౌస్‌బాషా బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి 20: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న స్థానిక వికలాంగుల కొట్టాలకు చెందిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఐ నాగమధు బుధవారం తెలిపారు. అతను బళ్లారి నుంచి టెట్రా ప్యాకెట్లు తెచ్చి.. విక్రయిస్తున్నాడని, అతని నుంచి 864 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అతనిపై కుందుర్పి పోలీస్‌స్టేషన్, అనంతపురం సెబ్ పోలీస్‌స్టేషన్లలో మూడు కేసులున్నాయన్నారు.

హత్యాయత్నం కేసులో రెండేళ్ల జైలు శిక్ష

అనంతపురం క్రైం, మార్చి 20: హత్యాయత్నం కేసులో స్థానిక రహమత్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ముషాదిక్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పీఏఎస్‌జే కోర్టు జడ్జి దీన బుధవారం తీర్పు వెలువరించారు. 2018లో మహమ్మద్ ముషాదిక్ అదే కాలనీలో ఉంటున్న వ్యాన్ డ్రైవర్ ఉమా మహేష్ చిన్నపాటి గొడవ జరిగింది. ఉమామహేష్‌పై ముషాదిక్ కత్తితో దాడి చేసి... గాయపర్చాడు. ఈ ఘటనపై స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ ఎం.బలరామరావు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన పీఏఎస్‌జే కోర్టు జడ్జి బుధవారం తీర్పు ఇచ్చారు.

ఇంజనీరు శ్రీరామకృష్ణయ్యకు ఘన నివాళి



రామకృష్ణయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్ టవర్, మార్చి 20: రాయలసీమ కల్పతరువు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం రూపకర్త ఇంజనీరు శ్రీరామకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ రోడ్డులోని తెలుగుతల్లి కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద బుధవారం పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి వేదిక 100 టీఎంసీల రామాంజినేయులు, అనంత హక్కుల పోరాట సంఘం రాహుల్, పీడీఎస్‌యూ నాయకులు వీరేంద్ర, జై భారత్ నాయకులు కుళ్లాయప్ప సభ్యులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ తదితరులు

అనంతపురం టౌన్ : ప్రపంచ నోటి ఆరోగ్య శుభ్రత మాసోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో వైద్యశాఖ అవగాహన ర్యాలీ చేపట్టింది. వైద్యశాఖ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఈ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డీఎంఓ డాక్టర్ ఓబులు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి, డీఈఐసీ మేనేజరు రజిత, ఎన్‌హెచ్ఎం కిషోర్, డెమోలు ఉమాపతి, త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 23 వేలు, కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 364 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.





ఆర్అండ్‌బీ కార్యాలయం, నత్తనడకన సాగుతున్న సర్జరీ బ్లాక్ నిర్మాణ పనులు

మాతాశిశు విభాగం ఏర్పాటు కలేనా..!

- సర్వజన ఆస్పత్రిలో బాలింతలకు తప్పని కష్టాలు
- ఐదేళ్లు కావస్తున్నా సాగని పనులు
- పాలకులు, అధికారుల్లో కనిపించని చిత్తశుద్ధి
- రూ. 300 కోట్లు మంజూరైనా... వీడని నిర్లక్ష్యం

అనంతపురం టౌన్, మార్చి 20: స్థానిక సర్వజన ఆస్పత్రిలోని మాతా శిశు విభాగం సరైన వసతులు, మంచాలు లేక బాలింతలు, నవజాతి శిశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా మాతా శిశు విభాగం (ఎంసీహెచ్ బ్లాక్)ను ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వాలు కృషి చేశాయి. దీంతో ఈఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి రూ 300 కోట్లు మంజూరయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత... ఆ పనులు కేవలం మాటలకే పరిమితమయ్యాయి. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఎపుడు మాట్లాడినా రూ.300 కోట్లతో ఆస్పత్రిలో ఎంసీహెచ్, సర్జరీ బ్లాక్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పేవారు. సర్జరీ బ్లాక్‌ను మున్సిపాల్ గెస్ట్ హౌస్ సమీపంలోను, ఎంసీహెచ్‌బ్లాక్‌ను ఆర్అండ్‌బీ కార్యాలయం స్థలంలో నిర్మించాలని టెండర్లు పిలిచారు.

ప్రారంభం కాని ఎంసీహెచ్ బ్లాక్ పనులు

సర్జరీ, ఎంసీహెచ్ బ్లాక్‌ల నిర్మాణానికి ఇరిగేషన్, ఆర్అండ్‌బీ కార్యాలయాలు ఖాళీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం కోసం ఆర్అండ్‌బీ కార్యాలయాన్ని ఇప్పటికీ ఖాళీ చేయలేదు. ఈ కార్యాలయం నిర్వహణకు శారదానగర్‌లోని కేన్సర్ ఆస్పత్రికి సంబంధించిన భవనాలను కేటాయిం చారు. అయినా ఇక్కడి భవనాన్ని ఆ శాఖ అధికారులు ఖాళీ చేయలేదు. కాగా, ఇరిగేషన్ కార్యాలయాన్ని అధికారులు ఖాళీ చేయగా అక్కడ సర్జరీ బ్లాక్ పనులు ఏడాది క్రితం మొదలయ్యాయి. రూ 6 కోట్లు బిల్లులు పెండింగ్ ఉండడంతో కాంట్రాక్టర్ ఈ పనులను నిర్లక్ష్యం చేస్తున్నాడు. దీంతో ఆ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో జిల్లా ఆస్పత్రిలో బాలింతలు, నవజాతి శిశువులకు కష్టాలు తప్పడంలేదు. పాలకులు, అధికారులలో చిత్తశుద్ధి లేకపోవడం వారి పాలిట శాపంగా మారింది.

ఉన్నతాధికారులకు తెలిపాం

ఆర్అండ్‌బీ కార్యాలయాన్ని తొలగించి మాతా శిశు బ్లాక్‌ను నిర్మించాల్సి ఉంది. అయితే ఆర్అండ్‌బీ కార్యాలయాన్ని ఆ అధికారులు ఖాళీ చేయలేదు. దీంతో ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం పనులు ఇంకా మొదలు కాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలుపుతూనే ఉన్నాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

అనంత టార్గెట్ పూర్తి

అనంతపురంరూరల్, మార్చి 20: అనంతపురం మార్కెట్ యార్డు మార్కెట్ ఫీజు వసూళ్లలో టార్గెట్‌ను పూర్తి చేసినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. 2023-24 ఆర్థిక జిల్లా మార్కెటింగ్ శాఖ రూ.4.10 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఆమె తెలిపారు. గత ఏడాది లాగానే ఈఏడాది లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. చీనీ మార్కెట్, పశువుల సంత, ఇరాత్ర వాటి ద్వారా బుధవారంతో రూ. 4.12 కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు. ఇందులో ప్రధానంగా ఫ్రూట్స్ మార్కెట్ ద్వారా రూ.1.59 కోట్లు, గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1.01 కోట్లు, ఎద్దులు, ఎనుములు సంతతో రూ.89.05 లక్షలు సమ కూరిందన్నారు. ఈ నెల ఆఖరి వరకు గడువు ఉండటంతో.. మరింత మార్కెట్ ఫీజు వసూలయ్యే అవకాశం ఉందన్నారు. లక్ష్యాన్ని పూర్తి చేయడానికి కృషి చేసిన ఉద్యోగులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

రెవెన్యూ అధికారులపై పీఎల్‌సీ నమోదు

బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప

అనంతపురం సెంట్రల్, మార్చి 20: పేదలకు పట్టాలను మంజూరు చేయాలని న్యాయ సేవా సదన్ కోర్టులో రెవెన్యూ అధికారులపై ప్రీ లిటిగేషన్ కేసు (పీఎల్‌సీ) నమోదు చేసినట్లు బహుజన లాయర్స్ ఫోరం (బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప తెలిపారు. బుధవారం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కోర్టులో బాధితులతో కలిసి ఆయన మాట్లాడారు. 70 మంది వికలాంగులు రూరల్ మండల పరిధిలోని ప్రభుత్వ స్థలంలో నివాసాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. అయితే స్థానిక వైసీపీ నాయకులు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు బాధితులను భయభ్రాంతులకు గురిచేసి ఆ నివాసాలను కూల్చివేశారన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి బాధితులకు పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గార్లదినె : మండలంలోని ముంటిమడుగు కొత్తూరు గ్రామంలో హరిజన తిరుపాలు అనారోగ్యంతో బుధవారం మరణిం చాడు. శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటి మడుగు కేశవరెడ్డి మృతునికి కుటుంబానికి టీడీపీ నాయకుల ద్వారా రూ. 10వేలు ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు గంగాధర్, శివయ్య, నెట్టికంతయ్య, నాగేంద్ర, బాబయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

అనంతపురం టౌన్, మార్చి 20: జిల్లాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదవ, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం అధ్యక్షుడు శ్రీధరబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవికి వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్లకు వందశాతం గ్రాస్‌తో వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే ఎన్‌హెచ్ఎం కింద పని చేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్లు కూడా కరోనా సమయంలో ప్రాణాలు తెగించి సేవలు అందించారని, వారికి మినిమం టైమ్ స్కేల్ కింద జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వడదెబ్బపై అవగాహన

అనంతపురం సెంట్రల్, మార్చి 20: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇటుకలపల్లిలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు ఖలీల్ బాషా, నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయండి

అనంతపురంరూరల్, మార్చి 20: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే టోల్ ఫ్రీ నెంబరు 08554-230139కు ఫిర్యాదు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ పార్టీకి చెందిన వారైనా కోడ్ ఉల్లంఘిస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఉచిత న్యాయ సేవా సదస్సు

రామగిరి, మార్చి 20: మండలంలోని రామగిరిలో దివ్యాంగులకు సంబంధించి టింబక్టు కలెక్టివ్ సహకారంతో ప్రతిభా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవా సదస్సును బుధవారం నిర్వహించారు. చదువు విలువ, వివాహ చట్టాలు, వికలాంగుల చట్టాలపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభా సొసైటీ సీఈఓ నరసింహులు, అధ్యక్షుడు నాగరాజు, డైరెక్టర్ అనిత, టీం సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

అనంతపురం క్రైం, మార్చి 20: నగరంలోని బిందెలవారి కాలనీలో పారిశుధ్య పనులను నగర కమిషనర్ మేఘ స్వరూప్ బుధవారం తనిఖీ చేశారు. మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని సంబంధిత ఇంజనీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశించారు. రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్, నీరు ప్రగతి పార్కులను పరిశీలించారు. హౌసింగ్‌బోర్డు, అశోక్‌నగర్‌లలో ప్రధాన రహదారులలో అభివృద్ధి పనులనూ పరిశీలించారు. అభివృద్ధి పనుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డు చేసేలా చర్యలు తీసుకోవాలని ఈఈని ఆదేశించారు.

పెరిగిన హుండీ ఆదాయం

అనంతపురం కల్చరల్, మార్చి 20: స్థానిక విరూపాక్షేశ్వరాలయం హుండీ ఆదాయం పెరిగింది. గతేడాది శివరాత్రి తర్వాత చేపట్టిన హుండీ లెక్కింపులో రూ.1,35,800 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది శివరాత్రి తర్వాత బుధవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టగా రూ.2,59,001 ఆదాయం వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.1,23,201 ఆదాయం పెరిగినట్లయింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ బీఆర్ వెంకటేశులు, ధర్మకర్తల మండలి చైర్మన్ కలవల సతీష్, ప్రధానార్చకుడు నిఖిల్ పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీ

అనంతపురం అర్బన్, మార్చి 20: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని మూడు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కమిషనరేట్ ఏడీ శ్రీనివాసాచార్యులు, ఏఓ శివరామకృష్ణ, అనంతపురం ఏడీఏ రవి అయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, పలు రికార్డులు పరిశీలించారు. హెర్బిసైడ్ టోలరెన్స్ పత్తివిత్తనాలను ఏపీ ప్రభుత్వం నిషేధించిందన్నారు. ఎవరైనా హెర్బిసైడ్ టోలరెన్స్ పత్తి విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ రాకేష్‌నాయక్, అనంతపురం ఇన్‌చార్జి ఏఓ సాయి లక్ష్మి పాల్గొన్నారు.

మందుల దుకాణాల్లో ...

అనంతపురం న్యూటౌన్, మార్చి 20: స్థానిక మెడికల్ స్టోర్స్‌లో డ్రగ్స్ కంట్రోల్ పరిపాలన విభాగం అధికారులు, విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఐరన్ బ్రిడ్జి వద్ద ఉన్న జనతా మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, హెచ్ ఆర్ మెడికల్ స్టోర్, సెవెన్ హిల్స్ ఫార్మసీ, కీర్తి మెడికల్ స్టోర్స్, శ్రీదేవి మెడికల్స్ స్టోర్ తదితర దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కొన్ని దుకాణాల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే అల్ట్రాసెట్ మాత్రలు, ఇతర మందులు విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించారు. నిబంధనలు ఉల్లంగించిన వారిపై ఫారం 35లో నమోదు చేశారు. ఈ తనికీల్లో సీఐ వెంకటరమణ, ఏఈఈ రవీంద్రనాథ్, డ్రగ్స్ కంట్రోల్ పరిపాలన విభాగం ఏడీ రమేష్‌రెడ్డి, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

రామగిరి, మార్చి 20: చట్టాలపై మహిళలు పూర్తి స్థాయిలో అవగాహన కల్గి ఉండాలని మహిళా శక్తి సొసైటీ అధ్యక్షురాలు వహీదా, మహాశక్తి సీఈఓ రమీజా పేర్కొన్నారు. మండలంలోని సీ కొత్తపల్లి గ్రామంలో మహిళా శక్తి సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత న్యాయ సేవా సంస్థ సదస్సు నిర్వహించారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను వివరించారు. ప్రత్యేకంగా నాటికను వేయించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహి ళాశక్తి సొసైటీ సీఈఓ కవిత, టింబక్టు కలెక్టివ్ గౌరీ, మేనేజర్ సుకన్య పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లంకాదహనం

అశ్వవాహనంపై విహరించిన చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ,మార్చి 20: పట్టణంలోని గవిమఠ స్థిత చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం లంకాదహనం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవమూర్తిని గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడివరకూ ఊరేగించారు. లంకాదహన కార్యక్రమాన్ని ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, గవిమఠం సహాయక మిషనర్ చిట్టెమ్మ ప్రారంభించారు. అనంతరం ఉత్సవమూర్తిని లంకా దహనం ఎదుట ఉంచి పెద్దసంఖ్యలో బాణాసంచా కాల్చారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అలాగే అశ్వవాహనంపై చంద్రమౌళీశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తి అశ్వవాహనంపై కొలువుదీర్చి గవిమఠం నుంచి ఎదురు బసవన్న గుడి వరకూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆదోని చౌకి మఠం పీఠాధిపతి కల్యాణ్‌స్వామి, సిబ్బంది నారాయణస్వామి, మధు, వెంకటేశులు, రఘు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

నార్పల, మార్చి 20: రాష్ట్ర అభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని శింగనమల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు అన్నారు. నార్పల మండలం గూగూడు, నడింపల్లి గ్రామాల్లో వీరి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో టీడీపీ సైకిల్ గుర్తుకు ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ సీనియర్ నాయకుడు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, మాజీ ఎంపీపీ ఆకుల అరుణ, రామ్మోహన్ నాయుడు, ఎర్రినాగప్ప, జాఫర్, రాజన్న, ఓబులేసు, ఆకుల తేజ, రామానాయుడు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



నార్పల, మార్చి 20: స్థానిక మంగళవీధిలో బుధవారం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేదపండితులు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బ్రహ్మయ్య ఆచారి కుటుంబ సభ్యులు పెద్దమ్మ తల్లి కట్ట నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ చేశా రు. అమ్మవారి కట్ట వద్ద భజనలు, వేద మంత్రో చ్చారణల మధ్య ఊరేగింపు నిర్వహించారు. హోమాలు, మంత్రపుష్పం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. గ్రామస్థులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాండురంగస్వామి నిజపాద దర్శనం



అనంతపురం కల్చరల్, మార్చి 20: ఫాల్గుణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద దర్శన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివార్ల మూలవిరాట్‌లకు ఫలపంచామృతాభిషేకాలు చేయడంతో పాటు విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

రేణుకా యల్లమ్మ సాక మహోత్సవాలు



అనంతపురం కల్చరల్, మార్చి 20: పాతూరు సున్నపువీధిలోని చంద్రగుత్తి రేణుకా యల్లమ్మ దేవాలయంలో బుధవారం అమ్మ వారి సాక మహోత్సవాలను భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి స్వర్ణక వచంతో ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహిం చారు. మహామంగళహారతి నివేదనా నంతరం అన్నసం తర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బండి చంద్ర శేఖర్‌గౌడ్, సభ్యులు పెద్ద బాలఓబన్న, చిన్న ఓబన్న, ఓబయ్య, నాగరాజు, ప్రసన్నకుమార్, పెద్ద ఓబులేసు, నరేష్, దీక్షిత్, పుల్లన్న, కౌషిక్, ముసలన్న పాల్గొన్నారు.


'సీతమ్మవారికి సారె' పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వామి

అనంతపురం కల్చరల్, మార్చి 20: సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న 'సీతమ్మ వారికి సారె సమర్పణ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి రోడ్డులోని దత్తాత్రేయ మందిరంలో దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయా నందతీర్థ స్వామి వాటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజి మాట్లాడుతూ... సీతామాతకు సారె సమర్పించే కార్యక్రమం రాష్ట్రంలోనే తొలిసారి అని పేర్కొన్నారు. సీతామాతను ప్రతి ఇంట ఆడబిడ్డగా భావించి ప్రతి ఇంటి నుంచి సారె సమర్పించాలని స్వామీజి కోరారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, జ్ఞానసాగర దత్త ప్రచార సభ ట్రస్టు కన్వీనర్ శర్మ గోసాల, తిరుపాల్‌రెడ్డి, సాయి ట్రస్టు సభ్యులు నాంరాయణ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

'కోడుమూరు' పరిశీలకుడిగా రామలింగారెడ్డి



బుక్కరాయసముద్రం, మార్చి 20: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడిగా శింగనమల నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డిని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం నియమించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు, ప్రచార బాధ్యతలు, పార్టీ సమన్వయం తదితర అంశాల పరిశీలకుడిగా అతన్ని నియమించారు.

బీసీహాస్టల్ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్



ధర్మవరం రూరల్, మార్చి 20: సత్యసాయి జిల్లా బీసీ హాస్టల్ వార్డెన్ల సంఘం అధ్యక్షుడిగా కనగానపల్లి బీసీ హాస్టల్ వార్డెన్ వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో హాస్టల్ వార్డెన్ల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి లలితాదేవి తెలిపారు.

డీఎస్‌డీఓగా షేక్ షఫీ



అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 20: జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ)గా అన్నమయ్య జిల్లా డీఎస్‌డీఓ షేక్ షఫీ నియమితులయ్యారు. బుధవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్‌డీఓ నరసింహారెడ్డి గుంటూరు కబడ్డీ కోచ్‌గా బదిలీ చేశారు.



బీకేఎస్‌లో ప్రచారం చేస్తున్న కేశవరెడ్డి, రామలింగారెడ్డి, శ్రీధర్ బాబు, పసుపుల హనుమంతురెడ్డి, బండారు శ్రావణిశ్రీ సోదరి కిన్నెరశ్రీ



రాప్తాడు మండలం పాలచెర్లలో పరిటాల సునీత సోదరుడు ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు



అనంతపురంరూరల్ మండలం తాటిచెర్లలో టీడీపీ నాయకుల ప్రచారం



చెన్నేకొత్తపల్లి మండలం పులేటిపల్లి గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు





ఆత్మకూరు మండలం రంగంపేట గ్రామంలో ప్రచారం చేస్తున్న టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, నాయకులు, వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఎల్ఐసీ రామంజి తదితరులు



కనగానపల్లి మండలం మద్దలచెరువులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో టీడీపీ నాయకుల ప్రచారం

జితేంద్రగౌడ్‌కే టిక్కెట్టు ఇవ్వాలి



జితేంద్రగౌడుకు సంఘీభావాన్ని తెలుపుతున్న టీడీపీ నాయకులు

గుంతకల్లు, మార్చి 20: కష్టకాలంలో పార్టీకి దిశానిర్దేశం చేసిన జితేంద్ర గౌడుకే గుంతకల్లు అసెంబ్లీ టిక్కెట్టును కేటాయించాలని పలువురు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని మహేంద్ర కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు ఆత్మీయ సదస్సును నిర్వహించారు. కృపాకర్, తలారి మస్తానప్ప, టీ కేశప్ప, ఎస్ఎల్ ప్రసాద్, రామన్న చౌదరి, బండి లక్ష్మీదేవి, ఇందిరమ్మ, గిడ్డయ్య, గుత్తి జిలాన్ బాషా, శ్రీనివాస యాదవ్, వీరేశ్, పామిడి ఎంహెచ్ లక్ష్మీనారాయణ, నారాయణ స్వామి, జయకుమార్, రాజేశ్ నాయక్, రమేశ్ నాయక్ తదితరులు మాట్లాడుతూ వైసీపీ పూర్తిగా చెత్తగా మారిందని, అందులోంచి వచ్చిన జయరాం సచ్ఛీలుడు అవుతాడా? అని ప్రశ్నించారు. ఐదేళ్ల వ్యయప్రయాసలకు ఓర్చి పార్టీ కార్యక్రమాలను చేసిన జితేంద్రగౌడుకు కాకుండా జయరాంకు టిక్కెట్టును అధిష్ఠానం కేటాయించకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ గుంతకల్లు నాయకులు పాల మల్లికార్జున, రాయల్ రామయ్య, శివప్ప, ఆటో ఖాజా, ఫ్రూట్ మస్తాన్, ఫజులు, కే సురేశ్, మాధవి, అంజలి, జయమ్మ, రాయల్ వెంకటేశులు, ముక్కన్నగారి రామాంజనేయులు, గుత్తి నాయకులు దిల్కాసీన, శ్రీకాంత్ చౌదరి, మహమ్మద్ అలీ, నెట్టికంటయ్య, పామిడి నాయకులు ఆదినారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే విజయం మనదే

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్



తాడిపత్రిలో పార్టీలో చేరిన వారితో జేసీపీఆర్

పెద్దవడుగూరు, మార్చి 20: రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేస్తే విజయం మనదేనని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంతోపాటు కిష్టిపాడు గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకొని ప్రజల్లోకి వెళ్లాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించాలన్నారు. అదేవిధంగా టీడీపీ మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని తెలియజేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్యపరిచే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, గంగరాజు యాదవ్, రమేష్‌యాదవ్, హరికృష్ణారావు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

తాడిపత్రిటౌన్: టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పలువురు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పట్టణంలోని ఆసుపత్రిపాలెంకు చెందిన మాజీ కౌన్సిలర్ నాగరంగయ్య, యల్లనూరురోడ్డులో ఉంటున్న వైసీపీ నాయకుడు వాసుదేవరెడ్డిలకు జేసీపీఆర్ పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ఎంఏ రంగారెడ్డి, చింబిలి ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక నివాసంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నందలపాడుకు చెందిన వైసీపీ మద్దతుదారులు హరినాథ్‌రెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, వలి, అరవిందరెడ్డితోపాటు 10కుటుంబాలు పార్టీలో చేరాయి.

అభివృద్ధే టీడీపీ అజెండా: అశ్మిత్



సమస్యలపై ఆరాతీస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

యాడికి, మార్చి20: అభివృద్ధి అజెండాగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. బుధవారం యాడికిలోని చౌడేశ్వరికాలనీ, చెన్నకేశవకాలనీల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. కాలనీవాసులను కలిసి స్థానిక సమస్యలపై ఆరాతీశారు. ప్రజా సంక్షేమ పాలన రావాలంటే టీడీపీని బలపరచాలని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆదినారాయణ, తెలుగు రైతు కమిటీ జిల్లా కార్యదర్శి రవికుమార్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ మాదాల అనిల్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆదినారాయణ, తెలుగుయువత నాయకులు విక్రమ్ ఉన్నారు.

బలిజసంఘం ఆధ్వర్యంలో ప్రచారం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సీపీఐ కాలనీలో బుధవారం బలిజ సంఘం ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు ప్రసాద్, రంగనాయకులు, గండికోట కార్తీక్, ఆదినారాయణ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని 2వవార్డు పరిధిలోని ఏటిగడ్డపాలెంలో నెలకొన్న నీటి సమస్యను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పరిష్కరించారు. కొన్నిరోజులక్రితం వార్డులో పర్యటించిన సమయంలో నీటి సమస్యతో ఇబ్బందిపడుతున్నామని మహిళలు ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన బుధవారం సొంత నిధులు వెచ్చించి బోరుకు మోటార్‌ను అమర్చి నీటి కష్టాలను తీర్చారు.

తగ్గుపర్తిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ

బెళుగుప్ప, మార్చి 20: మండలంలోని తగ్గుపర్తిలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విజయసింహా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

రాయదుర్గంరూరల్, మార్చి 20: పట్టణం సమీపంలోని ఓ డిగ్రీ కాలేజీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని టీ వీరాపురం గ్రామానికి చెందిన రాజు తన ఆటోలో రాయదుర్గం నుంచి ఐదుగురిని ఎక్కించుకుని టీ వీరాపురం గ్రామానికి వెళ్తున్నాడు. పట్టణ సమీపంలోని ఓ డిగ్రీ కాలేజీ వద్ద ఆటో బోల్తాపడడంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భీమన్నకు బలమైన గాయాలు కావడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయింది: కాంగ్రెస్

బొమ్మనహాళ్, మార్చి 20: ఒక్క చాన్స్ ఇవ్వండి అని ఓటు వేయించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని లేకుండా జగన్ చేశారని ఏపీ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వడ్డే చిన్నప్పయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఉంతకల్లు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిందన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని మండిపడ్డారు. సింగనహళ్లి, హరేసముద్రం, కళ్లహోళ గ్రామాల వైసీపీకి చెందిన ఉపేంద్ర, వన్నప్ప, గోవింద, జగదీష్, శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.

సింహవాహనంపై చెన్నకేశవస్వామి

యాడికి, మార్చి 20: బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాడికిలోని చెన్నకేశవస్వామి బుధవారం సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 22న రాయలసీమస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి, రెండవ, మూడవ, నాలుగవ విజేతలకు రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులను అందజేస్తామన్నారు.

ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యం

ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మిస్తాం: మాజీ మంత్రి కాలవ



ఉద్దేహాళ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, మార్చి 20: ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీకి ప్రజలు ఓటు వేస్తారని మాజీ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉద్దేహాళ్‌లోని క్యాంపు, అంబేడ్కర్ కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్దేహాళ్‌లో పాత మాగాణి 500 ఎకరాలు బీడుగా మారిందని. అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువను నిర్మించి పాత మాగాణి ఆయకట్టు సాగులోకి తీసుకొస్తామన్నారు. ఉంతకల్లు వద్ద రిజర్వాయర్ నిర్మించి ఈ ప్రాంతంలో అంతా రెండు పంటలు పండించి సస్యశ్యామలంగా ఉండేలా చూస్తానన్నారు. ఉద్దేహాళ్‌కు వచ్చిన సందర్భంగా ఐటీడీపీ నాయకులు గజమాలతో కాలవ శ్రీనివాసులును సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంటేశులు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎస్‌కే మల్లికార్జున, మాజీ జడ్పీటీసీలు కుమ్మరి మల్లికార్జున, వాణిజగన్నాథ్‌రెడ్డి, మాజీ కన్వీనర్లు చలపతి, సుదర్శన్, క్లస్టర్ కన్వీనర్ మాలపాటి ధనుంజయ, పయ్యావుల అనిల్, మాజీ డైరెక్టర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ఉండి ఏం చేశావో చెప్పాలి

రాయదుర్గం నియోజకవర్గానికి మెట్టు గోవిందరెడ్డి ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఏపీఐఐసీ చైర్మన్‌గా ఉండి ఏం చేశాడో చెప్పాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సవాల్ చేశారు. మెట్టు గోవిందరెడ్డి చేసిన ఆరోపణలపై స్పందించారు. బుధవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కెంచానపల్లి దగ్గర టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీస్ తీసుకొస్తా, విత్తనాల పరిశ్రమ పెట్టిస్తా, గార్మెంట్ పరిశ్రమను ఆదుకుంటానని ఒక్క పని కూడా చేయలేని అసమర్థుడు మెట్టు గోవిందరెడ్డి అని విమర్శించారు. నీకెందుకు అధికారం నీ వ్యాపారాన్ని పెంచుకోవడానికా లేదా గోరంట్ల ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ భూములను లాక్కోవడానికా అని ప్రశ్నించారు. ఏమి చేయలేని మెట్టు నా గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు, నవీన్, నాయకులు సైకిల్‌షాప్ హనుమంతు, సంగప్ప, ఐటీడీపీ అధ్యక్షులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ మాజీ ఎంపీటీసీ ఇందిరమ్మ

మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన వైసీపీ మాజీ ఎంపీటీసీ ఇందిరమ్మ, వైసీపీ నాయకుడు లక్ష్మిరెడ్డి బుధవారం కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ నాయకులు అప్పారావు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన దేవగిరి ఎంపీటీసీ హనుమేష్ తండ్రి చంద్రప్పతోపాటు దేవగిరి, బండూరు గ్రామాలకు చెందిన 80 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముల్లంగి నారాయణస్వామి, ఎన్‌కే మల్లికార్జున, పయ్యావుల నాగరాజు, నవీన్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు



పార్టీలోకి చేరిన వారితో అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 20: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో బుధవారం 150 వైసీపీ కుటుంబాలు పార్టీలోకి చేరారు. వైసీపీ నాయకులు సూగేపల్లి సురేంద్ర, దురదకుంట నారాయణ, ఒంటిమిద్దె విజయ్, న్యాయవాది ఆంజనేయులు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ఎస్సీ కాలనీవాసులు సుమారు 150 కుటుంబాలు పార్టీలోకి చేరారు. ప్రజావేదిక వద్ద వారికి పార్టీకండువాలు వేసి ఆహ్వానించారు. అమిలినేని సురేంద్రబాబు గెలుపునకు శాయశక్తులా కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు తెలిపారు. అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ అందరూ ఒక్కటిగా వుంటూ టీడీపీ విజయానికి శాయశక్తులా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

కుందుర్పి: నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం కుందుర్పి మండల పరిధిలోని అపిలేపల్లి, కుందుర్పి, బెస్తరపల్లి గ్రామాల్లో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా అపిలేపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామిను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడదూరంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం ఉందన్నారు. అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. సాగు, తాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు.



ఆంజనేయస్వామిని దర్శించుకుంటూ...

విఠోబా ఆలయంలో ప్రత్యేక పూజలు

పామిడి, మార్చి 20: పట్టణంలోని రంగసుభే ఫిర్కా భగవాన్ దాస్ విఠోబా స్వామి దేవాలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఠోబా స్వామి, రుక్మిణి అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం రుక్మిణి సమేత విఠోబాస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. పాండురంగ స్వామి నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో రంగసుభే ఫిర్కా కార్యదర్శి టీటీ శ్రీనివాసరావు, ఉత్తర్కార్ మంజునాథరావు, బొచరే రవికుమార్, అర్చకులు తేజస్వామి, భావసార క్షత్రియ భజన మండలి, మహిళా మండలి పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

పామిడి, మార్చి 20: పట్టణంలోని భోగేశ్వరస్వామి, లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయాల్లో గురువారం హుండీ లెక్కింపు చేపడుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి క్రిష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లెక్కింపునకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనాలన్నారు.

ఘనంగా పెద్దమాంబ విగ్రహ ప్రతిష్ఠ



ఆశీర్వాదం తీసుకుంటున్న పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మార్చి 20: వజ్రకరూరు మండల పరిధిలోని ఛాయాపురం గ్రామంలోని పెద్దమాంబ ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. యంత్ర, విగ్రహ ప్రతిష్ఠను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతిష్ఠ, చండీ హోమం, పూర్ణాహుతి చేశారు. మహామంగళహారతి అనంతరం అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వినాయక ఆలయంలో...

బెళుగుప్ప: మండలంలోని తగ్గుపర్తి గ్రామంలో బుధవారం వినాయక ఆలయంలో నూతన మండపం, గోపుర కలశ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌తోపాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే బొమ్మలను మూసివేశారు

గుత్తిరూరల్, మార్చి20: మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో బుధవారం సీఎం, ఎమ్మెల్యే బొమ్మలను మూసివేశారు. ఆ ఫోటోలకు స్టిక్కర్ వేయండి ప్లీజ్ శీర్షిక ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైంది. మండల ఎన్నికల అధికారులు స్పందించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి సచివాలయానికి ఉన్న శిలాఫలకాంలో సీఎం, ఎమ్మెల్యే ఫోటోలకు సిబ్బందితో మూసివేయించారు.

నేత్రపర్వంగా లంకాదహనం

అశ్వవాహనంపై విహరించిన చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ,మార్చి20: పట్టణంలోని గవిమఠ స్థిత చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం లంకాదహనం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవమూర్తిని గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడివరకూ ఊరేగించారు. లంకాదహన కార్యక్రమాన్ని ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, గవిమఠం సహాయకమిషనర్ చిట్టెమ్మ ప్రారంభించారు. అనంతరం ఉత్సవమూర్తిని లంకాదహనం ఎదుట ఉంచి పెద్ద సంఖ్యలో బాణాసంచా కాల్చారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అలాగే అశ్వవాహనంపై చంద్రమౌళీశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తి అశ్వవాహనంపై కొలువుదీర్చి గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆదోని చౌకిమఠం పీఠాధిపతి కల్యాణ్‌స్వామి, సిబ్బంది నారాయణస్వామి, మధు, వెంకటేశులు, రఘు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గురవయ్యల నృత్యం

పట్టణంలోని గవిమఠంలో వెలిసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఆలుమత కురుబ కులస్థుల ఆధ్వర్యంలో గురవయ్యలకు పాలు తాపే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమాన్ని ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా గురవయ్యలు సంప్రదాయ వేషధారణతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం శివునికి పూజలు నిర్వహించిన ప్రత్యేక పాత్రల్లో ఉంచిన పాలను గురవయ్యలు తాగగా వారి పాదాలకు నమస్కరించి భక్తులు ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో గవిమఠం సహాయకమిషనర్ చిట్టెమ్మ, ఆలుమత గురువు అర్జున్‌స్వామి, కురుబ సంఘం నాయకులు ఆకుకూరల నాగరాజు, ఈశ్వర్, గోపాల్, చేజాల నాగరాజు, కారంపొడి లింగన్న, శరత్ పాల్గొన్నారు.



అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామివారు

'టీడీపీ విజయం తథ్యం'



పామిడిలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన నాయకులు

పామిడి, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ విజయం తథ్యమని, చంద్రబాబునాయుడును ఆదరించాలని మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్, సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, నారాయణ అన్నారు. పట్టణంలోని మాజీ కౌన్సిలర్ వైయూ రామాంజనేయులు, బెస్త కులస్థులతో బుధవారం వారు సమీక్షించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రజలందరికీ టీడీపీ సంక్షేమం, అభివృద్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవకుమార్, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్, టీడీపీ నాయకులు ఓబులేసు, రవితేజ, కృష్ణయ్య, తిమ్మప్ప, అశోక్, సుంకిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక

పట్టణంలోని పలు కాలనీలకు చెందిన 25 కుటుంబాలు బుధవారం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వైసీపీ నాయకులు సోము, పసుల నాగరాజు, నిమ్మకాయల శ్రీనివాసులు, హోటల్ గోవిందుతోపాటు మరో 20 కుటుంబాలకు మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్, సోదరులు నారాయణస్వామి, నారాయణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని వెల్లడించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముసలిరెడ్డి, నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

గుత్తిరూరల్: తెలుగుదేశంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి గుమ్మానూరు జయరాం సోదరులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని లచ్చానిపల్లి గ్రామంలో పలువురు నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి, నారాయణ, కుమారుడు ఈశ్వర్ మాట్లడుతూ తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రభాకర్ చౌదరి, రవితేజ, ప్రతాప్, గోవిందు, రామాంజునేయులు తదితరులు పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి

రాయదుర్గంటౌన్, మార్చి 20: పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులో ప్రసిద్ధి చెందిన శ్రీబన్ని మహంకాళి ఆలయంలో బుధవారం వేకువజామున చోరీకి ఓ దొంగ విఫలయత్నం చేశాడు. తెల్లవారుజామున హుండీ పగలగొట్టడానికి దొంగ ప్రయత్నిస్తుండగా స్థానికులు, భక్తులు కనుగొని దేహశుద్ధి చేశారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

13 మందిపై కేసు నమోదు

రాయదుర్గంరూరల్, మార్చి 20: మండలంలోని కొంతానపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం పొలం తగాదా విషయంలో జరిగిన ఘర్షణలో 13 మందిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. పొలం విషయంలో బోయ రమేష్, బోయ చంద్ర, చిన్న ఆంజనేయులు, పెద్ద ఆంజనేయులు ఘర్షణ పడటంతో పలువురికి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 13 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మెడికల్ స్టోర్‌లో చోరీ

గుత్తి,మార్చి20: గుత్తిఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డులో హాజీ మెడికల్ స్టోర్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడి రూ.10వేలు అపహరించినట్లు బాధితుడు అమీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుంతకల్లుటౌన్, మార్చి 20: పట్టణంలోని పోర్టర్‌లైన్‌లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న షేక్ చాంద్‌బాషను అరెస్టు చేసి అతడినుంచి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. సమాచారం మేరకు దాడులు నిర్వహించి చాంద్‌బాష వద్ద నుంచి 90ఎంఎల్ 18 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

పురుగుల మందు కలిపిన నీరు తాగి మేకలు మృతి

గుమ్మఘట్ట, మార్చి 20: పంటలకు పిచికారి చేసేందుకు నిల్వ ఉంచిన నీటిని తాగి మేకలు, గొర్రెలు, ఆవు తాగి అక్కడికక్కడి మృతి చెందాయి. మండలంలోని భూపసముద్రం గ్రామ శివారులో రైతులు మొక్కజొన్న, వేరుశనగ పంటలకు యూరియాను పిచికారి చేసేందుకు మందులను నీటిలో కలిపి నిల్వ ఉంచారు. మూగజీవాలు దాహం తీర్చుకునేందుకు ఆ నీటిని తాగడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి నవీన్ సంఘటనా స్థలానికి వెళ్లి వైద్యం చేసి కొన్ని గొర్రెలు, మేకలను కాపాడినట్లు రైతుల తెలిపారు. కాగా 13 మేకలు, 9 గొర్రెలు, ఆవు మృతి చెందాయి.

వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయండి: సీపీఎం

కణేకల్లు, మార్చి 20: రైతుల వ్యవసాయ రుణాలతోపాటు బంగారు రుణాలపై కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేయాలని సీపీఎం, రైతు సంఘం నాయకులు యూనియన్ బ్యాంకు అధికారులను కోరారు. మండల రైతు సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సీపీఎం నాయకులు కోరి నాగరాజు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఇతర బ్యాంకులు రైతులు రుణాలకు సంబంధించి కేవలం వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేస్తున్నారని, కానీ యూనియన్ బ్యాంకులో మాత్రం వడ్డీతోపాటు అసలు కూడా చెల్లించాలని అంటున్నారన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు, బంగారు రుణాలపై కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకొని రుణాలను రెన్యువల్ చేయాలని కోరారు.

వైభవంగా ముత్యాల పల్లకి మహోత్సవం

రాయదుర్గంరూరల్, మార్చి 20: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో వెలసిన మద్దానేశ్వరస్వామి జాతర సందర్భంగా బుధవారం ముత్యాలపల్లకి వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వెండి రథంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బసవరాజు పాల్గొన్నారు.

అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు

తాడిపత్రిటౌన్, మార్చి 20: ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు పట్టణంలోని అనుమానిత ప్రదేశాల్లో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ మురళీకృష్ణ సిబ్బందితో కలిసి పట్టణంలోని లాడ్జీలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, పలు బహిరంగ ప్రదేశాలను తనిఖీచేశారు. బస్టాండ్‌లో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఒక వ్యక్తి తిరుగుతుండడంతో బ్యాగును తనిఖీ చేయగా రూ.12,77,000 నగదు దొరికిందన్నారు. సదరు వ్యక్తిని విచారించగా తనది డోన్‌మండలం ఆవులదొడ్డి గ్రామమని బంగారం కొనుగోలు చేయడానికి పొద్దుటూరు వెళుతున్నానని చెప్పాడన్నారు. డబ్బులకు సరైన రసీదులు చూపలేదని సీఐ తెలిపారు. రూ.50వేలకు మంచి నగదును తీసుకువెళితే తప్పనిసరిగా సంబంధించిన పత్రాలను ఉంచుకోవాలని సీఐ సూచించారు.

వలంటీర్లపై ఆర్డీఓకు ఫిర్యాదు

కళ్యాణదుర్గం, మార్చి 20: వలంటీర్లు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని టీడీపీ నాయకుడు అవినాష్ చౌదరి ఆర్డీఓ రాణిసుస్మితకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఈ మేరకు వినతిపత్రం సమర్పించి అనంతరం మాట్లాడారు. వలంటీర్ల మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, డివైజ్‌లను వెంటనే అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అక్కడక్కడా వలంటీర్లు ప్రచారంలో పాల్గొంటున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యల్లనూరు, మార్చి 20: మండలంలోని చిత్రావతినది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి సీజ్‌చేశామని ఎస్ఐ గిరిబాబు తెలిపారు. బుక్కాపురం క్రాస్ వద్ద తనిఖీ చేశామన్నారు. బిల్లులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి మైనింగ్ అధికారులకు తదుపరి చర్యల నిమిత్తం పంపినట్లు ఆయన తెలిపారు.

పుట్లూరు: మండలశివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు బుధవారం ఎస్ఐ హేమాద్రి తెలిపారు. యల్లనూరు మండలం తిరుమలాపురం నుంచి పెద్దపప్పూరు మండలం తిమ్మనచెరువుకు తీసుకువెళుతుండగా పుట్లూరు శివారులో పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న మహేశ్వర్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్ సీజ్‌చేసి మైన్స్ అధికారులకు అప్పగించారు.

జూదరుల అరెస్ట్

పుట్లూరు, మార్చి 20: మండలంలోని కడవకల్లు గ్రామశివారులోని అరటితోటలో బుధవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టేచేసి వారివద్ద నుంచి రూ.9380 నగదు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి కేసునమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.